# సింగిల్ పేజీ కథలు


సీరియస్‌గా జాతకచక్రాలని పరిశీలిస్తున్న శాస్త్రి గారు తలుపు శబ్దమవడంతో బయటకి చూసారు. బయట దిగాలుగా ఉన్న రాజు కనిపించాడు.

"రావోయ్ చాన్నాళ్ళకొచ్చావ్" అని సాదరంగా ఆహ్వానించారు.

## జాతకం

లోపలికొచ్చిన రాజు కొద్దిసేపు మౌనంగా వుండిపోయాడు.

"ఏంటోయ్ అలా వున్నావు. మంచి నీళ్ళు తెస్తానుండు" అంటూ లేచారు శాస్త్రిగారు.



"అబ్బే ఏం లేదు సార్, ఏదో ఆఫీస్ గొడవలు. కొంచెం సేపు మీ ఇంట్లో ప్రశాంతంగా గడుపుదామని వచ్చాను" అన్నాడు రాజు.

"దానికేంటోయ్, అలాగే కానీ, ఆ తర్వాత, ఆ మధ్యన నువ్వు రాయమన్న జాతకాలు రాసాను. ఇదిగో చూడోసారి" అంటూ రెండు పేపర్లు ఇచ్చారు.

వాటన్నిటినీ పరిశీలించిన రాజు "చాలా విశదీకరించి రాసారు సార్" అన్నాడు.

"చాలా బావున్నాయి. నేను చెప్పినట్లు చెయ్యమను ఇంకా బావుంటుంది" అన్నారు శాస్త్రిగారు.

"అలాగే సార్. చాలారోజుల నుండీ నా జాతకం కూడా ఇద్దామనుకుంటున్నాను. ఏదో ప్రాబ్లమ్స్ వల్ల ఇవ్వలేకపోయాను" అన్నాడు రాజు.

"భలేవాడివేయ్. నీ జాతకం అంటే అన్నీ పక్కన పెట్టి రాసే వాడిని, ఏం ఏమైనా ప్రాబ్లమ్స్ వస్తున్నాయా?" అన్నారు శాస్త్రిగారు.

కొద్దిసేపాగి రాజు చెప్పసాగాడు.

"మీకు తెలియందేముంది? మాది పెద్ద కుటుంబం, చిన్నప్పట్నించీ కష్టాలుపడ్డాను. ఏదో నా చదువుకి తగ్గ ఉద్యోగం దొరికిందని సంతోషపడ్డాను. చేతనయినంతలో అందరికీ సాయపడుతున్నాను. కానీ, ఎంత చేసినా ఆఫీసులో గుర్తింపు ఉండడం లేదు. మేనేజ్‌మెంట్ కూడా వారికి కావాల్సిన వారికి ప్రమోషన్లు ఇచ్చి అభివృద్ధిలోకి తీసుకొస్తున్నారు. దానితో ఎవరి దగ్గరగా నాకు విలువ లేకుండా పోయింది" అని వాపోయాడు రాజు.

దీర్ఘంగా ఓసారి నిట్టూర్చి "సరే, నీ జాతకం ఓసారి పత్రా చూస్తాను. వీలైతే ఇవాళ సాయంత్రం రా" అని చెప్పి లోపలికెళ్ళారు శాస్త్రిగారు.

"అలాగేనండి" అంటూ బయటికొచ్చాడు రాజు.

చిన్నపాటి టెన్షన్‌తో పరీక్షరాస్తున్న విద్యార్థిలా కూర్చున్నాడు రాజు, శాస్త్రిగారి ముందు. పరీక్షగా జాతకాన్ని చూస్తున్నారు శాస్త్రిగారు. ఒకసారి తలెత్తి రాజు వైపు చూసారు. చిరునవ్వుతో అతని కాగితాన్ని ఇచ్చి "జాతకం ప్రకారం నీకు మంచి రోజులు ముందున్నాయి. దానికిముందు నువ్వు తెలుసుకోవాల్సింది చాలావుంది. మనం నివసిస్తున్నది భూమిమీద. మనచుట్టూ అనేక మనస్తత్వాలున్న మనుషులుంటారు. జాతకానికీ, జీవితానికి సంబంధం ఉంది. గ్రహాలు వాటి కున్న స్థానాన్ని బట్టి, మంచిని, చెడునీ కలిగిస్తుంటాయి. మన చుట్టూ ఉన్న మనుషులు కూడా ఈ గ్రహాల్లాంటి వారే. మనం గ్రహాలకి ఎలా అయితే పూజలూ, పునస్కారాలూ చేసి కొలుస్తామో, చుట్టూ ఉన్న వాళ్ళని కూడా అలాగే ట్రీట్ చెయ్యాలి. అంటే ప్రతివాళ్ళనీ పూజించమనీ కాదు, అలాగని తిట్టమనీ కాదు. మనకి సాధ్యమైనంతలో ఎవరికీ ద్రోహం చెయ్యకుండా, అధికారుల వద్ద మన్నన పొందుత్తూ, వారి కనుసన్నలలో మెలిగితే, ఎప్పుడైనా ఫలితం దక్కకపోదు. చెడు గ్రహాలకు దూరంగా ఉంటూ, వీలయితే ప్రసన్నం చేసుకోవాలి. గ్రహాల్లో మంచీ, చెడూ ఎలాగో మనుషుల్లో కూడా అంతే" అంటూ ముగించారు.

కొద్దిరోజుల తర్వాత రాజు శాస్త్రిగారింటికి స్వీట్ ప్యాకెట్‌తో ప్రత్యక్షమయ్యాడు. అతని వదనం వెలిగిపోతోంది. శాస్త్రిగారికి నమస్కరించి ఆయన చేతిలో స్వీట్ ప్యాకెట్ పెట్టాడు రాజు. ఆఫీసులో సమస్యలన్నీ తీరిపోయాయని అతని సంతోషం చెప్పకనే చెబుతోంది.

**పి.వి.ఎల్.చైతన్య** (విశాఖపట్నం)

## తనిఖీ

అది ఒక గవర్నమెంటు ఆఫీసు. ప్రభుత్వం వారు ఆ ఊళ్ళో కొత్తగా ఏర్పాటుచేసిన ఒక చిన్న బ్రాంచి ఆఫీసు అది. పదిమంది గవర్నమెంటు ఉద్యోగులు అందులో పనిచేస్తూ వుంటారు. ఒక ప్యూన్, ఒక టైపిస్ట్, ఆరుగురు జూనియర్ గుమాస్తాలు, ఇద్దరు సీనియర్ గుమాస్తాలు, వీళ్లందరికీ అధికారిగా ఒక ఆఫీసరు. దాదాపు అందరూ కొత్తగా జాయిన్ అయినవాళ్లే. ఆఫీసరుగారు కూడా కొత్తగా రిక్రూట్ అయి వచ్చినవాడు. డైరెక్ట్‌గా రిక్రూట్ అయి, సిన్సియర్‌గా పనిచేసేవాడు. అతని పేరు కూడా సి.పి.రావు. అంటే సిన్సియర్‌గా పనిచేసే రావు అని అంటూ వుంటారు.

సమయం పది గంటలు దాటింది. ఉద్యోగులందరూ ఒక్కొక్కరే వచ్చి ఎవరి సీట్లలో వారు కూర్చుని ఫైళ్లు తిరగేస్తున్నారు. ఆఫీసరుగారు కూడా వచ్చి తన ఛాంబర్‌లో కూర్చున్నారు. ఆరోజు వచ్చిన పోస్టులోని ఉత్తరాల్ని ప్యూన్ ఆఫీసరుగారి టేబిల్‌మీద పెట్టాడు. ఆఫీసరుగారు వాటిని పరిశీలిస్తూ అందులోంచి ఒక ఉత్తరాన్ని తీసుకుని ఉద్యోగుల దగ్గరకు వచ్చాడు. ఆఫీసరు ఏం చెబుతాడోనని అందరూ టెన్షన్‌గా వున్నారు.

"మైడియర్ ఫ్రెండ్స్. ఇవాళ మనకి హెడ్డాఫీసు నుంచి ఒక ముఖ్యమైన ఉత్తరం వచ్చింది. ఈ బుధవారం- అనగా ఎల్లుండి, హెడ్డాఫీసునుండి జనరల్ మేనేజర్ ఏ.వి.రావుగారు మన ఆఫీసు తనిఖీకి వస్తున్నారు. ఆయన ఆఫీసును ఇన్‌స్పెక్షన్ చేస్తారుట. కాబట్టి ఆయన వచ్చేటప్పటికి మనం అందరం ఎవరి సీట్లల్లో వాళ్ళు సక్రమంగా పనిచేస్తూ వుండాలి. ఆఫీసంతా నీటుగా సర్ది వుంచాలి. జి.ఎమ్‌గారి నుండి ఎటువంటి బేడ్ రిమార్కు వరకు రాకూడదు. జాగ్రత్త" అని హెచ్చరించారు. స్టాఫంతా "అలాగే" అని తలలూపారు.

ఆరోజు రానే వచ్చింది. స్టాఫంతా పది గంటలకే వచ్చి సీట్లల్లో కూర్చుని ఫైళ్ళు రాస్తున్నారు. 11 గంటలు కాగానే ఆఫీసరుగారు రైల్వే స్టేషనుకెళ్ళి, రైలులో దిగిన ఏ.వి.రావుగారికి స్వాగతం చెప్పి కారులో ఆఫీసుకు తీసువచ్చారు. కారులోంచి దిగి ఆయన హుందాగా ఆఫీసులోకి అడుగుపెట్టారు. స్టాఫంతా సీట్లలోంచి లేచి 'గుడ్‌మార్నింగ్', 'నమస్తే సార్' అని ఆయనకు విష్ చేసారు. వాళ్ల నమస్కారాలు అందుకుంటూనే జి.ఎమ్.గారు ఆఫీసరు ఛాంబర్‌లోకి వెళ్లి అంతా చూసి, తిరిగి ఆఫీసు హాల్లోకి వచ్చి అందరి ముఖాలూ చూశారు.



ఆయన ముఖం ధుమధుమలాడుతోంది. విసుగ్గా వున్నారు. ఆఫీసరుని పిలిచి "మిస్టర్ సి.పి.రావ్. నీ సర్వీసెంత?" అని ప్రశ్నించారు.

"కొత్తగా రిక్రూట్ అయ్యానుసార్! డైరెక్టు పోస్టింగ్..ఈ ఆఫీసులోనే ఇచ్చారు" చెప్పాడు వినయంగా.

"అయితే నీకు అనుభవం లేదన్నమాట. అందుకే-నిన్నూ, నీ స్టాఫ్‌నూ హెచ్చరిస్తున్నాను" అని ఒక్కక్షణం ఆగి మళ్లీ ప్రారంభించాడు.

"ఇది- ఏ ఆఫీసు అనుకున్నారు? గవర్నమెంటు ఆఫీసు. తెలుసు కదా! గవర్నమెంటు ఆఫీసులో ఉద్యోగులు ఎక్కడైనా పని చేస్తూ సీట్లలో మేలుకుని కూర్చుంటారుటయ్యా నేను వచ్చేసరికి ఎవరూ కూడా సీట్లల్లో నిద్రపోవట లేదే! టేబిళ్లు, కుర్చీలు ఇచ్చాం కదయ్యా! టేబిలు మీ వ తల పెట్టో, కాళ్లు జాపో-నిద్రపోతూ వుంటారని అన కుంటే, ఇదేం బుద్ధయ్యా మీకు! వెరీ-బేడ్" అని రుసర సలాడి మళ్లీ హెచ్చరించారు.

"ఇకనైనా జాగ్రత్తగా వుండండి. 10 గంటల నుంచీ ఒక గంట దాకా స్లీప్ బ్రేక్. ఒక గంటనుంచీ రెండు గంటల వరకూ లంచ్‌బ్రేక్. అన్నం తిన్న వెంటనే. పడుకోకూడదు కాబట్టి, ెండు గంటల నుంచీ 3 గంటల వరకూ సీట్లల్లో కూ ్చుని అలవోకగా ఫైళ్ళు పట్టుకోవాలి. మూడునుంచీ మ ాడున్నర వరకూ టీ బ్రేక్. తరువాత అయిదు గంటల వరకూ అంటే-ఆఫీసు టైమయ్యేవరకూ-మళ్లీ యధా కారంగా స్లీప్ బ్రేక్! ఇదీ-ఆఫీసు పద్ధతయ్యా! తెలిసిందా" అని లెక్చర్ దంచాడు.

ఆఫీసు గోడల చుట్టూ చూశాడు. గోడలకు తగిలించిన మహాత్మాగాంధీ, జవహర్‌లాల్‌నెహ్రూ తదితర దేశనాయకుల ఫోటోలు ాలుగైదు కనిపించాయి.

"ఈఫోటోలు ి గిలించమని ఎవరు చెప్పారు?" అడిగారు ఆఫీసర్ని.

"కొత్త ఆఫీసుకదండీ! నేనే తెప్పించి గోడలకు పెట్టాను సార్" జవాబిచ్చాడు సి.పి.రావు.

ఏ.వి.రావుగారు ఆయన్ని ఉరుముతూ చూసి "గవర్నమెంటు ఆఫీసులో ఎవరైనా. గాంధీ, నెహ్రూల ఫోటోలు పెడతారుటయ్యా? నీ పిచ్చిగాని, వెంటనే వాళ్ల ఫోటోలు తీయించేయ్. వాటి స్థానంలో కుంభకర్ణుడు, ఊర్మిళ- ఇలాంటివాళ్ల ఆయిల్ పెయింటింగ్‌లు తయారుచేయించి, తగిలించండి. వెంటనే ఆ పని చేయించండి" అని స్టాఫ్ వైపు తిరిగి "వెళ్లండి. వెళ్లి ఎవరి సీట్లల్లో వాళ్ళు బుద్ధిగా పడుకోండి" అని హూంకరించాడు.

స్టాఫంతా-తలలూపుతూ తమ తమ 'డ్యూటీ'ల్లో లీనమైపోయారు.

"మిస్టర్ సి.పి.రావ్! నాకు కూడా డ్యూటీ టైమయింది. పద నీ ఛాంబర్‌లోనే, ఇద్దరం డ్యూటీ చేద్దాం. సాయంత్రం ఐదుగంటల వరకూ 'ఇన్‌స్పెక్షన్' జరుగుతూ వుంటుంది. అంతవరకూ మనకి నిద్రాభంగం కలగకూడదు జాగ్రత్త!" అని ప్యూన్‌ని పిలిచి

"నువ్వు మా ఛాంబర్ గుమ్మం దగ్గరే, స్టూలు మీద కూర్చుని కనుకుపాట్లు పడుతూ వుండు. మాకు డిస్టర్బెన్స్ కాకూడదు" అంటూ ఆవలిస్తూ ఛాంబర్‌లోకి అడుగులేశాడు మిస్టర్ ఏ.వి.రావ్, జి.ఎమ్. మెల్లిగా చిటికలేసి, ఆవలిస్తూ, ఆయన్ను అనుసరించాడు పాపం సి.పి.రావ్!

**-న్యాయపతి బాలకృష్ణారావు** (బీదర్)

